క్లుప్తంగా

అమ్మవారి అన్నదానంలో ముస్లిం మహిళ సేవలు


భక్తులకు వడ్డిస్తున్న షకీలా

అమలాపురం టౌన్: అమలాపురం శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయం వద్ద జరిగిన అన్న సమారాధనలో ముస్లిం మహిళ సేవలందించడం అందరికీ ఆనందం కలిగిస్తోంది. ఈ దసరాకే కాదు.. కొన్నేళ్లుగా శ్రీదేవి ఉత్సవ కమిటీ భక్తుల సహకారంలో తొమ్మిది రోజులూ వేలాది మందికి అన్నసమారాధన నిర్వహిస్తోంది. అదే వీధికి చెందిన మెహబూబ్ షకీలా అమ్మవారి ఆలయానికి సంబంధించి ఏ సేవా కార్యక్రమం జరిగినా తన వంతుగా సహకారం అందిస్తోంది. రెండు దశాబ్దాలకు పైగా ఆమె సేవలందిస్తోంది. ఆమె జాతీయ, రాష్ట్ర స్థాయి అథ్లెటిక్ పోటీల్లో పాల్గొని ఎన్నో పతకాలు కై వసం చేసుకుంది. జిల్లా మహిళా కాంగ్రెస్ నాయకురాలిగా కూడా పలు పదవులతో పనిచేస్తోంది. సేవకు కులం, మతంతో పనిలేదని షకీలా నిరూపించింది.

రోడ్ల నిర్మాణానికి రూ.13.43 కోట్ల నిధులు

ముమ్మిడివరం: నియోజకవర్గంలో నాలుగు మండలాల్లో ఎంజీ ఎన్ఆర్ఈజీఎస్ నిధులతో వివిధ గ్రామాల్లో రూ.13.43 కోట్లతో రోడ్ల నిర్మాణం చేపడుతున్నట్టు ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు తెలిపారు. ఆయన గురువారం ముమ్మిడివరంలో విలేకరులతో మాట్లాడుతూ గ్రామీణ ప్రజలకు ఇబ్బందులు లేకుండా సీసీ రోడ్ల నిర్మాణం చేపడుతున్నామన్నారు. ముమ్మిడివరం మండలానికి రూ.2.91కోట్లు, కాట్రేనికోన మండలానికి రూ.2.82లక్షలు, ఐ.పోలవరం మండలానికి రూ.4.26కోట్లు, తాళ్లరేవు మండలానికి రూ.3.43కోట్లతో సీసీ రోడ్లు నిర్మాణం చేపడుతున్నామన్నారు. ఈ పనులకు ఈనెల 14న ముమ్మిడివరం, 15న తాళ్లరేవు, 16న ఐ.పోలవరం, 17న కాట్రేనికోన మండలంలో పల్లె పండగ కార్యక్రమంలో శంకుస్థాపన కార్యక్రమాలు చేపడతామని ఎమ్మెల్యే సుబ్బరాజు తెలిపారు.

పల్లె పండగను విజయవంతం చేయాలి

ముమ్మిడివరం: ఈనెల 14 నుంచి నిర్వహించే పల్లె పండగ పంచాయతీ వారోత్సవాలను విజయవంతం చేయాలని ఎంపీపీ కోలా గంగా భవాని విజ్ఞప్తి చేశారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాడి వెంకటాచార్యులు అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈనెల 14నుంచి 21 వరకు జరిగే కార్యక్రమాలను సమీక్షించారు. 15 గ్రామ పంచాయతీల్లో చేపట్టే 31 పనులకు గాను సుమారుగా రూ.2 కోట్ల 85 లక్షలు ఖర్చవుతుందన్నారు. ఈ పనులకు ఈ నెల 14న శంకుస్థాపన చేస్తారన్నారు. ఏవో ఏఎన్ శ్రీనివాస్, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఇంజినీర్ పీవీ శ్రీనివాస్, కోలా బాబ్జి, సీహెచ్ గున్నేపల్లి సర్పంచ్ గొలకోటి దొరబాబు, సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఎం.సత్యనారాయణ, అధికారులు పాల్గొన్నారు.

14 నుంచి పల్లె పండగ

తాళ్లరేవు: పంచాయతీ వారోత్సవాలలో భాగంగా ఈ నెల 14వ తేదీ నుంచి పల్లె పండగ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ కె.సత్యనారాయణ ఒక ప్రకటనలో తెలిపారు. 15వ ఆర్థిక సంఘం నుంచి మంజూరైన పనులకు భూమిపూజ చేయనున్నట్టు తెలిపారు.

ధర్మ పరిరక్షణకు కృషి

తాళ్లరేవు: ధర్మ పరిరక్షణకు అందరూ కృషి చేయాలని విశ్వ హిందూ పరిషత్ కోనసీమ జిల్లా విశేష సంపర్క్ ప్రముఖ్ భమిడిపాటి కృష్ణమూర్తి, కాట్రేనికోన మండల ధర్మ రక్షక్ సత్యవాడ సతీష్ అన్నారు. పి.మల్లవరంలోని ముత్యాలమ్మ ఆలయంలో గురువారం ధర్మ పరిరక్షణ సభ నిర్వహించారు. విజయదశమి సందర్భంగా ప్రతి దేవాలయం వద్ద ఆయుధ పూజ తప్పని సరిగా చేయాలన్నారు. కాకినాడ వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఉంగరాల వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

తాళ్లరేవు: మండల పరిషత్ అభివృద్ధి అధికారి (ఎంపీడీవో)గా కోటిపల్లి సత్యనారాయణ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకూ పనిచేసిన ఎం.అనుపమ కరపకు బదిలీ అయ్యారు. ఆమె స్థానంలో సత్యనారాయణ నియమితులయ్యారు. ఇప్పటి వరకూ ఆయన అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్‌గా పనిచేస్తున్నారు. కాగా.. బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఆయన ఎంపీపీ రాయుడు సునీతను మర్యాదపూర్వకంగా కలిశారు. సత్యనారాయణను ఎంపీపీ సత్కరించారు.

అధికారులను కలిసిన సర్పంచులు

అమలాపురం రూరల్: పంచాయతీ అధికారి శాంతాలక్ష్మిని అమలాపురం మండల సర్పంచుల సమైఖ్య అధ్యక్షురాలు నక్కా అరుణ కుమారి ఆధ్వర్యంలో సర్పంచులు కలుసుకున్నారు. కామనగరువులో డీపీవో కార్యాలయంలో గురువారం సర్పంచులు నక్కాఅరుణకుమారి, దాసరి అరుణ, రేలంగి దుర్గారావుతో పాటు నాయకులు నక్కా చంద్రశేఖర్, చొల్లంగి అప్పాజీ, కరాటం ప్రవీణ్, దాసరి డెవిడ్ డీపీవోను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛంతో అభినందనలు తెలిపారు. అదేవిధంగా ఎంపీడీవో ఉండ్రు బాబ్జీరాజు, ఈవోపీర్డీ జి. మంగదేవిని సర్పంచులు అభినందనలు తెలిపారు.

ఏరులై పారుతూ..

- యథేచ్ఛగా మద్యం విక్రయాలు
- తీర ప్రాంతాల్లో మరింత జోరు
- బెల్టు షాపుల్లో అమ్మకాలు


గతంలో పోలీసులకు పట్టుబడిన మద్యం (ఫైల్)

కాట్రేనికోన: అక్రమ మద్యం అమ్మకాలు ఏరులై పారుతోంది. అమ్మ జాతర మహోత్సవాల ముసుగులో మండల పరిధి తీర ప్రాంతాలలో అక్రమ మద్యం అమ్మకం జోరుగా సాగుతోంది. పల్లం, లోతు కాలువ, చిర్రయానం తదితర గ్రామాలలో అమ్మవారి జాతర జరుగుతోంది. బెల్టు షాపులలో మద్యం అమ్మకాలు యథేచ్ఛగా సాగుతున్నాయి. కొత్త ప్రభుత్వం మద్యం పాలసీ వచ్చేలోపు శివారు ప్రాంతాల్లో పుదుచ్చేరి యానానికి చెందిన నాన్ డ్యూటీ ఫెయిడ్ మద్యాన్ని బెల్టు షాపుల్లో విక్రయిస్తున్నారు. ప్రభుత్వం కొత్త షాపులకు టెండర్లు పిలవడంతో తెలుగు తమ్ముళ్లు దీపం ఉన్నప్పుడే ఇల్లు చక్కబెట్టుకుంటున్నారు.

విక్రయాలు జరిగే గ్రామాలివే..

మండలంలో ప్రభుత్వ మద్యం షాపులు ఉన్నప్పటికీ కూల్ డ్రింక్ షాపులలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ఇక్కడ బెల్టు షాపులు కుటీర పరిశ్రమగా మారాయి. ప్రధాన కేంద్రం కాట్రేనికోన గేటు సెంటరు బస్టాండు, సుబ్బారాయుడు గుడి, ఆటోస్టాండ్, వంతెన సమీపంలోను, చెయ్యేరు, చెయ్యేరు అగ్రహారం, పెనుమల్లే, ఉప్పూడి ఓఎన్‌జీసీ రోడ్డు సమీపంలోను, కుండలేశ్వరం, వేట్లపాలెం, రాజానగరం, సత్తెమ్మ చెట్టు, కాపులపాలెం, దొంతికుర్రు, పల్లంకుర్రు, కందికుప్ప, పల్లం, కొత్తపాలెం, మొల్లేటిమొగ, చిర్రయానం, బలుసుతిప్పతో పాటు ప్రతి గ్రామ కూడళ్లలోను బెల్టు షాపులలో మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. ప్రభుత్వ మద్యం షాపులలో పని చేస్తున్న సిబ్బంది చేతి వాటంతో బెల్టు షాపులకు మద్యం చేరుతుందనే ఆరోపణలు ఉన్నాయి.

ప్రభుత్వ ఆదాయానికి గండి

పుదుచ్చేరి రాష్ట్రానికి చెందిన మద్యం గోదావరి పాయల ద్వారా బోట్లపై శివారు ప్రాంతాలకు తరలించి విక్రయిస్తున్నారు. దీంతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. సముద్ర తీర ప్రాంత గ్రామాలు జి.మూలపాలం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, అక్రమ మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. విక్రయదారులకు కావాల్సిన మద్యానికి సొమ్మును మధ్య వర్తులకు చెల్లిస్తే సరుకును బోటు వరకు అప్పగిస్తారు. అక్కడ నుంచి గోదావరి పాయల ద్వారా బోటులో అక్రమంగా తీసుకొస్తున్నారు. పుదుచ్చేరి యానంలో చీఫ్ లిక్కర్ గ్రీన్ స్టోన్, మెన్స చాయస్, గోల్డు కఫ్ రూ.70లకు కొనుగోలు చేసి రూ.150లకు, ఎంహెచ్, రాయల్ స్టాంగ్, రాయల్ గ్రీన్ మద్యం రూ.140లకు కొనుగోలు చేసి 250లకు విక్రయిస్తున్నారు. పోలీసులు ఒత్తిడితో బలుసుతిప్ప గ్రామంలో బెల్టు షాపులకు వేలం పాటలు నిలిపి వేసి ఏడాదికి కొంత సొమ్మును గ్రామానికి చెల్లించి గుట్టు చప్పుడు కాకుండా అమ్మకాలు చేసేవారు. ప్రభుత్వ పాలసీ రాకుండానే దళారులు గ్రామానికి రుసుం చెల్లించకుండా విక్రయాలు చేస్తున్నారు.

మద్యం షాపులకు అనధికారిక వేలం

మండలంలో కొత్త మద్యం షాపులు వచ్చిన తరువాత ఆంధ్ర మద్యంను విక్రయించేందుకు చిర్రయానం ఏడాదికి రూ.9,75,000 చెల్లించేందుకు వేలం పాటలు నిర్వహించారు. పల్లం, కొత్తపాలెం, మొల్లేటిమొగ, పోర గ్రామాలలో బాటిల్‌పై రూ.10 అదనంగా విక్రయించేందుకు నెల వారీ సొమ్మును చెల్లించేందుకు అనధికారిక ఒప్పందాలు కుదుర్చుకున్నారు.

ఆదర్శ గ్రామానికి బెల్టు షాపుతో తూట్లు

ఉమ్మడి గోదావరి జిల్లాలో కాట్రేనికోన మండల పరిధిలోని గచ్చకాయల పోర మద్యపానం నిషేధించి ఆదర్శంగా నిలిచింది. మద్యం సేవించి గ్రామంలో పదుల సంఖ్యలో మృతి చెందడంతో 20 ఏళ్ల క్రితం మద్యపానాన్ని నిషేధించారు. సమీపంలో కాపుల పాలెంలో బెల్టు షాపు నిర్వహించడంతో ఆదర్శ గ్రామానికి తూట్లు పొడుస్తున్నారు. పోలీసులకు నెల వారీ మామూళ్లు అందడంతో యథేచ్ఛగా బెల్టు షాపు అమ్మకాలు చేస్తున్నారు. బెల్టు షాపును తక్షణమే నిలిపి వేయాలని గ్రామస్తులు పలుమార్లు చెప్పినా సదరు వ్యక్తి మద్యం అమ్మకాలు మానడం లేదు.

యానాంలో క్రీడా కార్యదర్శి పర్యటన


క్రీడా కార్యదర్శిని శాలువాతో సత్కరిస్తున్న ఆర్‌ఏఓ మునిస్వామి

యానాం: పుదుచ్చేరి స్పోర్ట్స్ సెక్రటరీ అమర్నాథ్ ఆర్. తలవాడే గురువారం యానాంలో పర్యటించారు. పుదుచ్చేరి ఆవల ఉన్న అన్ని రీజియన్‌లలోనూ కార్యదర్శులు పర్యటించాలని ఎల్జీ కై లాసనాథన్ ఇచ్చిన ఆదేశాల మేరకు ఆయన యానాం వచ్చారు. తొలుత ఆర్ఏఓ మునిస్వామిని కలిశారు. ఈ సందర్భంగా మునిస్వామి పుదుచ్చేరి స్పోర్ట్స్ సెక్రటరీని శాలువాతో సత్కరించారు. అనంతరం క్రీడా రంగానికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు.

సబ్ రిజిస్ట్రార్‌గా నరేంద్రకుమార్

యానాం: యానాం సబ్ రిజిస్ట్రార్‌గా పెట్ల నరేంద్రకుమార్‌ను డిప్యూటేషన్‌పై సంవత్సర కాలానికి నియమిస్తూ డీపీఅండ్ఏఆర్ కార్యదర్శి జయశంకర్ ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం ఆయన వ్యవసాయశాఖలో పని చేస్తున్నారు.

బండార్లంక చెత్త అమలాపురానికి వద్దు

రెండు ట్రాక్టర్ల చెత్తను వెనక్కి పంపించిన కౌన్సిలర్ రామకృష్ణ


బండార్లంక నుంచి అమలాపురం కంపోస్ట్ యార్డ్‌కు చెత్తను తీసుకొచ్చిన ట్రాక్టర్లు


అమలాపురం టౌన్: అసలే అరకొర కంపోస్టు యార్డు స్థలంతో సతమవుతున్న అమలాపురం మున్సిపాలిటీ రూరల్ మండలం బండార్లంక గ్రామ పంచాయతీకి చెందిన చెత్తను పట్టణంలోని యార్డ్‌కు తరలించే విషయమై స్థానిక మున్సిపల్ వార్డు కౌన్సిలర్ చిత్రపు రామకృష్ణ అభ్యంతరం చెప్పారు. బండార్లంక గ్రామంలోని చెత్తతో అమలాపురం కంపోస్టు యార్డ్‌కు గురువారం వచ్చిన రెండు ట్రాక్టర్లను అడ్డుకున్నారు. చెత్తతో నిండి ఉన్న ఆ రెండు ట్రాక్టర్లను అక్కడ నుంచి తక్షణమే వెనక్కి పంపించివేశారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 30 వార్డుల్లో సేకరించిన చెత్తను 29వ వార్డులో గల కంపోస్ట్ యార్డ్‌కు తరలిస్తారు. ఇప్పటికే యార్డ్ స్థలం సరిపోక చెత్త గుట్టలు కాస్తా కొండలుగా తయారయ్యాయని కౌన్సిలర్ రామకృష్ణ అన్నారు. ఇటీవల యార్డ్ స్థలం చెత్తతో మొత్తం నిండిపోవడంతో చెత్తను యార్డ్ ప్రవేశంలో ఉన్న పట్టణ బైపాస్ రోడ్డు చెంతనే పోశారని గుర్తు చేశారు. ఈ విషయమై ఇదే వార్డుకు చెందిన వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శి కముజు రమణ కూడా జిల్లా కలెక్టరేట్‌లో జరిగిన గ్రీవెన్స్ ఫిర్యాదు చేశారు. మున్సిపల్ కమిషనర్ మూడు రోజులకే ఆ పంచాయతీ అధికారుల అభ్యర్థన మేరకు అవకాశం ఇచ్చామన్నారు. ఆ గ్రామం నుంచి చెత్త తరలింపును ఆపేశామని నాలుగు రోజుల కిందటే చెప్పినప్పటికీ గురువారం అక్కడ నుంచి చెత్త ట్రాక్టర్లు రావడమేమిటని కౌన్సిలర్ రామకృష్ణ ప్రశ్నించారు.

ఎన్నికలు సజావుగా నిర్వహించాలి


అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ మహేష్‌కుమార్

సాక్షి, అమలాపురం: నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలను సజావుగా నిర్వహించేలా తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికల నిర్వహణకు సంబంధించి తీసుకోవాల్సిన చర్యలపై ఆయన ఇరిగేషన్, రెవెన్యూ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ నెల 16వ తేదీ నుంచి నవంబర్ 24 వరకూ 40 రోజుల కాల వ్యవధిలో నీటి వినియోగదారుల సంఘాలకు ఎన్నికలు పూర్తి చేయాలని నిర్ణయించిందన్నారు. జిల్లాకు సంబంధించి గోదావరి మధ్య డెల్టా ప్రాజెక్టు కమిటీలో 9 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు, 56 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని తెలిపారు. గోదావరి తూర్పు డెల్టా ప్రాజెక్టు కమిటీలో 8 డిస్ట్రిబ్యూటరీ కమిటీలు ఉండగా, 5 మాత్రమే కోనసీమ జిల్లా పరిధిలోకి వస్తాయన్నారు. దీని పరిధిలో 32 నీటి వినియోగదారుల సంఘాలు ఉన్నాయని, వీటన్నింటికీ ఎన్నికలు సజావుగా నిర్వహించేందుకు క్షేత్రస్థాయిలో అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. 16న నీటి వినియోగదారుల సంఘాల ఎన్నికలకు నోటిఫికేషన్ విడుదలవుతుందని, 26న టెరిటోరియల్ కౌన్సిల్ (టీసీ)ల వివరాలను ఇరిగేషన్ అధికారులు ప్రచురించాలన్నారు. 29న తుది టీసీల వివరాలను ప్రచురించాలన్నారు. వచ్చే నెల 5వ తేదీన టీసీలలో ఓటర్ల జాబితాను రెవెన్యూ అధికారులు తయారు చేయాలన్నారు. వచ్చే నెల 8న తుది ఓటరు జాబితా ప్రచురించాలన్నారు. నవంబర్ 15న నీటి టెరిటోరియల్ నియోజకవర్గాలకు నవంబర్ 18న టీసీలకు, నీటి వినియోగదారుల సంఘాలకు, 21న డిస్ట్రిబ్యూటరీ కమిటీలకు, 24న ప్రాజెక్ట్ కమిటీలకు రెవెన్యూ, ఇరిగేషన్ అధికారుల సమక్షంలో ఎన్నికలు నిర్వహిస్తామని కలెక్టర్ తెలిపారు. టెరిటోరియల్ నియోజకవర్గాలలో భూమి కలిగిన రైతులను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత రెవెన్యూ అధికారులదేనన్నారు. ఎన్నికల్లో పోటీ చేసే వ్యక్తులకు ఎటువంటి నీటి పన్నుల బకాయిలు ఉండకూడదని పేర్కొన్నారు. ఇరిగేషన్ సూపరింటిండెంట్ ఇంజినీర్ శ్రీనివాస్, అమలాపురం, కొత్తపేట, రామచంద్రపురం ఆర్డీవోలు కె.మాధవి, శ్రీకర్, ఖతీబ్ కౌసర్ భానోలు పాల్గొన్నారు.

వ్యాపార దిగ్గజం టాటా మృతి తీరని లోటు


చంద్ర కుమార్ వేసిన టాటా చిత్రం

అమలాపురం టౌన్: ప్రపంచ వ్యాపార దిగ్గజం, వేలాది మందికి ఉద్యోగ ప్రదాత రతన్ టాటా దేశానికే తీరని లోటని ఎమ్మెల్సీ కుడుపూడి సూర్యనారాయణరావు అన్నారు. ఈ మేరకు ఎమ్మెల్సీ గురువారం ఓ ప్రకటన విడుదల చేశారు. టాటా దేశ ముద్దు బిడ్డగానే కాకుండా తాను చేసిన విస్తృత సేవలను ప్రచారం చేసుకోని అజ్ఞాన విరాళాల దాతగా ఓ ప్రత్యేక ముద్ర వేసుకున్నారని పేర్కొన్నారు. టాటా ఓ వ్యాపారి వేత్తగానే కాకుండా పేదలకు ఉచితంగా విద్య, వైద్యం అందించిన దాత అని ఆయన సేవలను ఎమ్మెల్సీ సూర్యనారాయణరావు కొనియాడారు.

అమలాపురం రూరల్: ఓ వ్యక్తి రతన్ టాటాకు చిత్ర నివాళి అర్పించాడు. అమలాపురం మండలం పాలగుమ్మి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల చిత్రలేఖన ఉపాధ్యాయుడు పోలిశెట్టి నరసింహ చంద్రకుమార్ వాటర్ కలర్స్ కలర్ పెన్సిల్స్ ఉపయోగించి రతన్ టాటా చిత్రాన్ని గీశాడు. ఈ చిత్రం పలువురిని ఆకట్టుకుంది. రతన్ టాటా మృతికి సంతాపంగా చంద్రకుమార్ చిత్రాన్ని వేసి ఘనంగా నివాళిలర్పించారు.

అమలాపురం టౌన్: వ్యాపార దిగ్గజం రతన్ టాటా మృతికి పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్‌కు చెందిన పలు వ్యాపార సంఘాలకు చెందిన వ్యాపారులు ఘనంగా నివాళులర్పించారు. స్థానిక గడియారం స్తంభం సెంటరులో చాంబర్ ఆఫ్ కామర్స్ ఆధ్వర్యంలో గురువారం సాయంత్రం రతన్ టాటా సంతాప కార్యక్రమం జరిగింది. తొలుత రతన్ టాటా చిత్ర పటానికి చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు కల్వకొలను తాతాజీ తదితర వ్యాపారులు పూల మాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. దేశంలోని వ్యాపారులకు ఆదర్శనీయుడు రతన్ టాటా అని ఆయన సేవలను వ్యాపారులు కొనియాడారు. చాంబర్‌కు చెందిన వ్యాపార ప్రతినిధులు యెండూరి నాగేశ్వరరావు, సంగినీడి బాబులు, చాగంటి ప్రసాద్, లంకలపల్లి సుబ్బారావు తదితరులు పాల్గొని రతన్ టాటాకు ఘనంగా నివాళులు అర్పించారు.


రతన్ టాటాకు నివాళులర్పిస్తున్న పట్టణ చాంబర్ ఆఫ్ కామర్స్ వ్యాపార ప్రతినిధులు

యానాం: దేశం ఓ పారిశ్రామిక దిగ్గజాన్ని కోల్పోయిందని, దేశాభివృద్ధికి రతన్‌టాటా చేసిన సేవలు చిరస్మరణీయమని ఎమ్మెల్యే గొల్లపల్లి శ్రీనివాస అశోక్ పేర్కొన్నారు. గురువారం రతన్‌టాటా మృతికి ఆయన సతాపం వ్యక్తం చేశారు. భారతదేశం ఒక మహావ్యక్తిని కోల్పోయిందన్నారు.

మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ అధ్యక్షుడిగా వెంకటేష్


మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకుంటున్న ఉద్యోగులు, సిబ్బంది

అమలాపురం టౌన్: స్థానిక మున్సిపల్ కౌన్సిల్ హాలులో అమలాపురం మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ నూతన కార్యవర్గం గురువారం సాయంత్రం ఏకగ్రీవంగా ఎన్నికై ంది. ఈ సందర్భంగా జరిగిన సమావేశానికి మున్సిపల్ మేనేజర్ ఎంవీఎస్ఎన్ మూర్తి అధ్యక్షత వహించారు. మున్సిపల్ ఉద్యోగులతోపాటు అవుట్ డోర్, ఇన్ డోర్ సిబ్బంది, పట్టణంలోని 15 వార్డు సచివాలయాల కార్యదర్శులు పాల్గొని నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అమలాపురం మున్సిపల్ ఉద్యోగుల యూనియన్ గౌరవాధ్యక్షుడిగా మాచిరాజు వీఎస్ఎన్ మూర్తి (మేనేజర్), అధ్యక్షుడిగా కె.వెంకటేష్ (ఏఈ నెం.3), ఉపాధ్యక్షుడిగా పూలపకూర బాలాజీ (ఆఫీస్ సబార్డినేట్), వైఎస్ భారతి (7వ వార్డు సచివాలయ శానిటేషన్ సెక్రటరీ), కార్యదర్శిగా పామర్తి తేజోమూర్తి (11వ వార్డు సచివాలయ ప్లానింగ్ సెక్రటరీ), సంయుక్త కార్యదర్శులుగా పల్లి వెంకటేశ్వరావు (రెవెన్యూ ఇన్‌స్పెక్టర్), తాణంకి బాలకృష్ణ (10వ వార్డు సచివాలయ అడ్మిన్), కోశాధికారిగా పి.లక్ష్మీసుజీ (జూనియర్ అసిస్టెంట్), ఉప కోశాధికారిగా బళ్ల సురేష్‌కుమార్ (8వ వార్డు సచివాలయ వెల్ఫేర్ సెక్రటరీ) ఎన్నికయ్యారు. వీరు కాకండా సమనస పద్మ, సంసాని వేణు, బి.రాణి సంయుక్త, జె.రాజేష్, డీఎం ప్రసాద్, పి.రమేష్, రాయుడు శ్రీనివాసరావు, గొడవర్తి సుధాకర్, కేపీపీ వదన్, చింతపల్లి నందీశ్వర్‌లు ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా ఎన్నికయ్యారు.

మానసిక ఆరోగ్యంతోనే మంచి జీవనం

అమలాపురం టౌన్: మనిషి మానసిక ఆరోగ్యం సంపూర్ణంగా ఉన్నప్పుడే మంచి జీవనానికి సాకారమవుతుందని అమలాపురం ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సౌమ్య పసుపులేటి సూచించారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినం సందర్భంగా స్థానిక ఏరియా ఆస్పత్రి ప్రాంగణంలోని డైస్ భవనంలో గురువారం జరిగిన మానసిక ఆరోగ్య అవగాహన సదస్సుకు డాక్టర్ సౌమ్య అధ్యక్షత వహించి ప్రసంగించారు. జిల్లా డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వో డాక్టర్ భరతలక్ష్మి, ఆస్పత్రి ఇన్‌చార్జి సూపరింటెండెంట్ డాక్టర్ అనూష, ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ నాగేంద్ర ప్రసాద్ అతిథులుగా పాల్గొన్నారు. మానసిక వైద్య నిపుణురాలు డాక్టర్ సౌమ్య మాట్లడుతూ మానసికంగా ఎవరికైనా సమస్యలు ఉంటే సహాయం కోసం తక్షణమే టెలిమానస్ టోల్ ఫ్రీ నెంబరు '14416'కి కాల్ చేసి మీ బాధలను పంచుకోవచ్చని సూచించారు.

కరుణించమ్మా.. కనకదుర్గమ్మా..


తాళ్లరేవు పరదేశమ్మ వీధిలో సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు


పాల కనకదుర్గమ్మ ఆలయంలో సువాసినీ పూజలో పాల్గొన్న మహిళలు



జార్జిపేటలో కాళికామాతగా దర్శనమిస్తున్న అమ్మవారు | నీలపల్లిలో దుర్గాదేవిగా అమ్మవారు


పసుపు కొమ్ముల అలంకరణలో సుబ్బాలమ్మ

తాళ్లరేవు: శరన్నవరాత్రుల ఎనిమిదో రోజైన గురువారం అమ్మవారు దుర్గాదేవి, కాళికామాత అలంకరణలో దర్శనమిచ్చారు. మండలంలోని పలు ఆలయాలు, మంటపాల్లో దుర్గాష్టమి సందర్భంగా అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. నీలపల్లిలో ప్రముఖ ఆధ్యాత్మికవేత్త కంచర్ల వెంకట నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పంచమ నవచండీ సహిత శరన్నవరాత్ర మహోత్సవాలలో అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించారు. అలాగే జార్జిపేటలోని శ్రీదుర్గా మల్లేశ్వరస్వామి ఆలయంలో అమ్మవారిని కాళికామాతగా అలంకరించి, విశేష పూజలు చేశారు. తాళ్లరేవు ప్రధాన రహదారి చెంతన పరదేశమ్మ వీధిలో ఉన్న కనకదుర్గమ్మ ఆలయం వద్ద సామూహిక కుంకుమ పూజలు నిర్వహించారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. పాతకోరంగి, పి.మల్లవరం, ఇంజరం కనకదుర్గమ్మ అమ్మవారిని దుర్గాదేవిగా అలంకరించిచారు.

వైభవంగా లక్ష పసుపు కొమ్ముల పూజ

ఐ.పోలవరం: మురమళ్ళ వీరేశ్వరస్వామి ఆలయంలో గురువారం లక్ష పసుపు కొమ్ముల పూజ నిర్వహించారు. ఆలయ అర్చకులు బ్రహ్మశ్రీ యనమండ్ర సత్య సీతారామశర్మ ఆధ్వర్యంలో పండితులు స్వామి, అమ్మవార్లకు శాస్త్రక్తంగా పూజలు చేశారు. తొలుత స్థానిక ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు దంపతులు, గ్రామస్తులు, భక్తులు పసుపు కొమ్ములతో గ్రామోత్సవం జరిపారు. లక్ష పసుపు కొమ్ములతో అమ్మవారికి అర్చన చేశారు. అనంతరం అమ్మవారిని పసుపు కొమ్ములతో సర్వాంగ సుందరంగా అలంకరించారు. మహిళలకు పసుపు కొమ్ములు, కుంకుమ వితరణ చేశారు. ఆలయ సహాయ కమిషనర్, ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ, పర్యవేక్షణ అధికారి కఠారి శ్రీనివాస రాజు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

వైభవంగా చండీ హోమం

అమలాపురం టౌన్: స్థానిక కన్యకా పరమేశ్వరీదేవి ఆలయంలో చండీ హోమం వైభవంగా నిర్వహించారు. పట్టణ ఆర్య వైశ్య సంఘం నాయకులు కాళ్లకూరి వైద్యనాథం, నంబూరి నానాజీ, నందిపాటి శ్రీనివాస్, కాళ్లకూరి కుమార్, పచ్చిగోళ్ల సోమరాజు, గోకవరపు సతీష్ దంపతులచే చండీ హోమాన్ని రుత్విక్కులు శాస్త్రోక్తంగా జరిగింది.

శ్రీదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు

స్థానిక శ్రీదేవి మార్కెట్‌లోని శ్రీదేవి అమ్మవారి ఆలయాన్ని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు గురువారం ఉదయం సందర్శించి, ప్రత్యేక పూజలు చేశారు. అమ్మ సన్నిధిలో అమ్మ నామ శ్లోస్త్రాలు జపిస్తూ కుంకుమ పూజ చేశారు.

పసుపు కొమ్ములతో సుబ్బాలమ్మకు అలంకరణ

అమలాపురం పట్టణ దేవత సుబ్బాలమ్మ ఆలయంలో అమ్మవారిని 120 కిలోల పసుపు కొమ్ములతో అలంకరించారు. శుక్ర, శనివారాల్లో కూడా అమ్మవారు పసుపు కొమ్ముల అలంకణతోనే దర్శనమిస్తారని ఆలయ అభివృద్ధి కమిటీ తెలిపింది. పట్టణానికి చెందిన దేవి ఫార్మా డిస్ట్రిబ్యూటర్స్ యాజమాని గునిశెట్టి వలీబాబు, వెంకటలక్ష్మి దంపతులు, వారి కుమారుల సౌజన్యంతో అమ్మవారిని పసుపు కొమ్ములతో అలంకంచినట్టు ఆలయ అభివృద్ధి కమిటీ పేర్కొంది.

మత్స్యకారులకు ట్రాన్స్‌పాండర్ల అందజేత

ఐ.పోలవరం: ప్రధానమంత్రి మత్స్య సంపద యోజన కింద వంద శాతం రాయితీతో మంజూరైన ట్రాన్స్‌పాండర్స్‌ను ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు (బుచ్చిబాబు) లబ్ధిదారులకు అందజేశారు. మురమళ్లలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద జరిగిన కార్యక్రమంలో మండలంలోని భైరుపాలెం గ్రామానికి చెందిన 64 మంది మత్స్యకారులకు వాటిని అందించారు. ఒక్కొక్క ట్రాన్స్‌పాండర్ విలువ రూ.37 వేల వరకు ఉంటుంది. మొత్తం రూ.24.12 లక్షల విలువైన ట్రాన్స్‌పాండర్స్‌ను మత్స్యకారులకు ఉచితంగా అందించినట్టు ఎమ్మెల్యే తెలిపారు. ఈ మొత్తంలో 60 శాతం కేంద్రం, 40 శాతం నిధులను రాష్ట్ర ప్రభుత్వం అందిస్తోందన్నారు. మత్స్యకారులు సముద్రంలో వేట సాగిస్తున్నపుడు ఏదైనా ఆపద సంభవిస్తే ఈ ట్రాన్స్‌పాండర్స్ సహాయంతో అధికారులకు, సమీపంలో చేపలు పట్టే వారికి సమాచారం అందిస్తారు. కార్యక్రమంలో మత్స్యశాఖ జిల్లా అధికారి సీహెచ్ గోపాలకృష్ణ, పెసంగి ధర్మారావు, పెసంగి రాజు, రేకాడి మురళీకృష్ణ, పెసంగి ఆనందరావు, గేదెల సత్తిబాబు, మత్స్యశాఖ సహాయకులు నవ్య, నరేష్ పాల్గొన్నారు.

మానసిక ప్రశాంతతతో జీవించాలి


సదస్సులో మాట్లాడుతున్న జడ్జి మొహమ్మద్ రహ్మతుల్లా

ముమ్మిడివరం: మానసిక ఆందోళన లేకుండా ప్రతిఒక్కరూ శాంతియుతంగా జీవనం సాగించాలని ముమ్మిడివరం జూనియర్ సివిల్ జడ్జి, మండల లీగల్ సర్వీసెస్ కమిటీ చైర్మన్ మొహమ్మద్ రహ్మతుల్లా పేర్కొన్నారు. ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం సందర్భంగా గురువారం స్థానిక ప్రభుత్వాసుపత్రిలో న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సదర్భంగా ఆయన మాట్లడుతూ మానసిక ఆందోళన లేకుండా అందరూ శాంతియుత జీవనం సాగించాలన్నారు. కొంత మందిలో హుషారు తగ్గడం, బద్ధకంగా మారటం, తిండి తగ్గించడం, నిద్ర సరిపోక తరచూ పడుకునే ఉండటం, అకారణంగా కోపం వంటి లక్షణాలు కనిపిస్తే మానసిక వైద్యులను సంప్రదించాలన్నారు. ప్రభుత్వ ఆసుపత్రులు ద్వారా అందించే ఉచిత వైద్య సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు దాసరి సత్యనారాయణ, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.

మద్యం షాపులకు 401 దరఖాస్తులు

ముమ్మిడివరం: ముమ్మిడివరం ఎక్సైజ్ సర్కిల్ పరిధిలో 13 మద్యం షాపులకు గాను గురువారం సాయంత్రానికి 401 దరఖాస్తులు వచ్చినట్లు ముమ్మిడివరం ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ సీఐ ఎల్.చిరంజీవి తెలిపారు. ఐ.పోలవరం మండలంలో మూడు మద్యం షాపులకు 106, కాట్రేనికోన మండలంలో 6 మద్యం షాపులకు 154, ముమ్మిడివరం నగర పంచాయతీలో మూడు షాపులకు 96, ముమ్మిడివరం రూరల్‌లో షాపునకు 45 దరఖాస్తులు వచ్చినట్లు ఆయన తెలిపారు.